గాడితప్పిన పాలన



- ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్‌లో సిబ్బంది కొరత
- రెండు నెలలుగా ఖాళీగా సీడీపీఓ పోస్టు
- 9 సెక్టార్లకు ఇద్దరే సూపర్‌వైజర్లు
- అందులో ఒకరికి ఇన్‌చార్జి సీడీపీఓ బాధ్యతలు
- ఆమె సైతం మెడికల్ లీవ్‌లోనే
- ఇష్టారాజ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

ఉదయగిరి: జిల్లాలో అత్యంత వెనుకబడిన ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో పాలన గాడి తప్పింది. ప్రాజెక్ట్ నిర్వహణను చూసేందుకు రెగ్యులర్ సీడీపీఓ లేరు. తొమ్మిది సెక్టార్లకు తొమ్మిది మంది సూపర్‌వైజర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారు కూడా పనిభారంతో అన్ని కేంద్రాలను తనిఖీ చేయలేకపోతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడి అంగన్‌వాడీలు సమయాన్ని పాటించడం లేదు. కేంద్రాలను ఎప్పుడు తెరుస్తారో..ఎప్పుడు మూసివేస్తారో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

వారం రోజుల్లో ఇన్‌చార్జి సీడీపీఓను నియమిస్తాం

ఉదయగిరి ప్రాజెక్ట్‌కు సీడీపీఓ నియామకానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఇన్‌చార్జి సీడీపీఓ నియామకానికి సంబంధించిన ఫైల్‌ను ఆర్‌జేడీ కార్యాలయానికి పంపాం. మరో వారం రోజుల్లో ఇన్‌చార్జి సీడీపీఓను నియమిస్తాం.

– హేనాసుజన్, పీడీ, ఐసీడీఎస్

వేధిస్తోన్న సూపర్‌వైజర్ల కొరత

ఉదయగిరి ప్రాజెక్ట్ పరిధిలో వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో సీతారామపురం, ఎస్సార్‌నగర్, ఉదయగిరి 1,2,3, దుత్తలూరు, నర్రవాడ, వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి సెక్టార్లు ఉన్నాయి. మొత్తం తొమ్మిది సెక్టార్లకు తొమ్మిది మంది సూపర్‌వైజర్లు ఉండాల్సి ఉండగా, కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారిలో ఉదయగిరి సెక్టార్–3 సూపర్‌వైజర్ తేజశ్వనికి ఇన్‌చార్జి సీడీపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.ఆమె కూడా ఆరోగ్య సమస్యలతో ఈ నెల 6వ తేదీ వరకు మెడికల్ లీవ్ పెట్టారు. ఆ తరువాత కూడా విధుల్లో చేరుతారా..లేక సెలవులను పొడిగించుకుంటారో కూడా తెలియని పరిస్థితి. మరో సూపర్‌వైజర్ వినీషా గ్రూప్స్ ప్రిపరేషన్ నిమిత్తం తొమ్మిది నెలల పాటు మెడికల్ లీవ్ పెట్టారు. ఉదయగిరి సెక్టార్–2 సూపర్‌వైజర్‌గా ఉన్న షానూ ఒక్కరే ప్రాజెక్ట్ మొత్తాన్ని పర్యవేక్షించాల్సి రావడంతో పాలన పూర్తిగా గాడి తప్పింది.

ఉదయగిరి ప్రాజెక్టు సమాచారం

అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు	గర్భిణులు, బాలింతలు
208	1000	2000

రెగ్యులర్ సీడీపీఓ లేక..

ఉదయగిరి ప్రాజెక్ట్ మారుమూల ఉండడంతో ఇక్కడ పని చేసేందుకు సీడీపీఓలు ముందుకు రావడం లేదు.ఎవరైనా వచ్చినా అనతికాలంలోనే బదిలీ చేసుకుని వెళ్లిపోతున్నారు. గత పదేళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉంది. రెండు నెలల క్రితం ఇక్కడ పనిచేస్తున్న సీడీపీఓ పచ్చ లావణ్య కనిగిరి ప్రాజెక్ట్‌కు బదిలీపై వెళ్లారు. అప్పట్నుంచి కొత్త వారిని నియమించలేదు. కనీసం పక్క ప్రాజెక్ట్‌లకు చెందిన సీడీపీఓలను కూడా ఇన్‌చార్జిగా నియమించలేదు. ఇక్కడ పని చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడమే అందుకు కారణమని చెబుతున్నారు. సూపర్‌వైజర్ల పరిస్థితి కూడా అంతే. ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, యూనియన్ లీడర్లు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం పావులు కదుపుతూ ఉంటారు. దీంతో ఒకరు అంటే ఒకరికి పడని పరిస్థితి నెలకొంది. ఈ జాఢ్యం సైతం ప్రాజెక్టును వేధిస్తోంది. పలు మండలాల్లో అంగన్‌వాడీల మధ్యన గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ వ్యవహారం కొత్తగా వచ్చిన అధికారులకు సమస్యగా మారి తమకు తలనొప్పి ఎందుకులే అని వారు సెలవు లేదా బదిలీపై వెళ్లిపోతున్నారు. ప్రాజెక్ట్ పరిధిలో పాలన గాడిన పడాలంటే రెగ్యులర్ సీడీపీఓతో పాటు ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ల పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- చంద్రబాబు తీరుపై వైఎస్సార్‌సీపీ నేతల ఫైర్

వింజమూరు (ఉదయగిరి): చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రెండు సార్లు ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం మోపి, ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టాలని చూడడం దారుణమని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. వింజమూరులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ నాయకులు వారం వారం అప్పులు తెచ్చి తమ జేబులు నింపుకొంటున్నారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేసి, హామీలు అమలు చేయలేక సెకీ పేరుతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, అదానికి ముడిపెట్టి తమ వైఫల్యాల నుంచి ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. 2014–19 టీడీపీ ప్రభుత్వ పాలనా కాలంలో చంద్రబాబు యూనిట్ రూ.5.10కు కొనుగోలు చేస్తే, జగన్ ప్రభుత్వం కేవలం రూ.2.49కే యూనిట్‌ను కొనుగోలు చేసేలా సెకీతో ఒప్పందం కుదర్చుకుందన్నారు. ఈ తేడాను గమనిస్తే ఎవరు అవినీతికి పాల్పడ్డారో తెలుస్తుందన్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలను అమాంతం పెంచేయడంతో పేదలు మూడు పూటలా అన్నం తినలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు విద్యుత్ చార్జీలు పెంచి వారిపై మరింత భారం మోపడం దారుణమన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోగా ఇసుక, మట్టి, మద్యం, నిత్యావసర సరుకుల రూపంలో రాష్ట్ర ప్రజలను దోచుకుంటూ వారి జీవితాలతో చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. సంపద సృష్టిస్తామని చెప్పిన బాబు ప్రజల సంపదను ఆవిరి చేస్తున్నారని మండిపడ్డారు. వింజమూరు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు రేవునూరి శ్రీనివాసరెడ్డి, కే రవీంద్రరెడ్డి, డీ వాసుదేవరెడ్డి, చిమ్మిల్ని రాజేంద్ర, మద్దూరి బాబు, ఎం విజయకుమార్‌రెడ్డి, ఎం చిన్నికృష్ణారెడ్డి, అంకినపల్లి నారసింహారెడ్డి, రొడ్డా కొండయ్య, అనంగి శ్రీనివాసులు, బీ విజయరెడ్డి, బీ గోపి, పీ ప్రసాద్‌రెడ్డి, డీ శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, రేణుమాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు అన్నదానం



కావలి: పట్టణంలోని తుఫాన్‌నగర్ పరిధిలోని జంగాలకాలనీలోని పేదలకు సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. పట్టణానికి చెందిన బండారు వంశీ తన తండ్రి బండారు వెంకయ్య జ్ఞాపకార్థంగా పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

13 మద్యం సీసాల స్వాధీనం

కావలి: మండలంలోని చెన్నాయపాళెం పంచాయతీ పరిధిలోని పాముగుంటపాళెంలో ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. పంతంగి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి 13 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని అక్రమంగా కలిగి ఉండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ఎం దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ క్రిస్మస్ వేడుకలు



ఆత్మకూరు: పట్టణంలోని సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం రాత్రి ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాస్టర్ జేడీ చంద్రపాల్ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులు కొవ్వొత్తులను చేతబట్టి క్రైస్తవ భక్తిగీతాలను ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. చర్చి కార్యదర్శి నందవరం ప్రసాద్, అధ్యక్షుడు నరసింహులు, భాస్కర్, విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు డివిజన్‌లో 173.8 మి.మీ వర్షపాతం

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల వరకు గడిచిన 24 గంటలకు గానూ 173.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా సంగం మండలంలో 51.4 మి.మీ. , ఆత్మకూరు 31.6, ఏఎస్‌పేట 21.6, అనంతసాగరం 17.4, చేజర్ల 30.6, మర్రిపాడు 6.2, సీతారామపురం 2, ఉదయగిరి 2.8, కలువాయి 41.8 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

పేదలకు చౌకగా వైద్యం



ఆత్మకూరు: పేదలకు చౌకగా వైద్యం అందించడమే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రెండు నెలలకోసారి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని నెల్లూరు రామచంద్రారెడ్డి ఆస్పత్రి వైద్యులు ఎంవీ రమణయ్య తెలిపారు. పట్టణంలోని షిర్డీ సాయిరామ్ కళాశాలలో జేవీవీ, డాక్టర్ జే శేషారెడ్డి అభిమాన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 90 మందికిపైగా రోగులకు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200కే అందజేశారు. జేవీవీ సభ్యులు మురళీకృష్ణ, హరికృష్ణ, మల్లికార్జున, షేక్ సందానీ, డేవిడ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి


- రూ.26,750 నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీలో సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతుండగా సీఐ జి.గంగాధర్, ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయిబాబా తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. రూ.26,750 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు కోర్టుకు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

జీవాలకు దోమతెర రక్షణ



వర్షాలకు దోమలు విజృంభించి జీవాల రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దీంతో జీవాలు క్రమంగా తగ్గిపోతూ అనారోగ్యానికి గురవుతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు పోషకులు దోమతెరలను ఆశ్రయిస్తున్నారు. ఇలా కావలి మండలం తుమ్మలపెంటలో జీవాల దొడ్డి చుట్టూ దోమతెరను ఏర్పాటు చేసుకోవడం సాక్షి కంటపడింది.

–కావలి

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలి: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని కావలి డీఎస్పీ పీ శ్రీధర్ సూచించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని 55 మంది రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్‌ను ప్రయోగిస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్ అనే ముద్ర మీ బిడ్డల భవిష్యత్‌పై ప్రభావం చూపుతుందని గుర్తుచేశారు. నేర ప్రవృత్తిని మార్చుకోవడానికి అవకాశం ఇస్తున్నామని, మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకుంటే రౌడీషీట్లను తొలగించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సీఐలు గిరిబాబు, రాజేశ్వరరావు, ఎస్సైలు శెట్టిపల్లి సుమన్, సీహెచ్ తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

300 మంది చిన్నారులకు దుస్తుల వితరణ



చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దేవిరెడ్డి దశరథరామిరెడ్డి

అల్లూరు: మండలంలోని నార్త్‌ఆములూరు పరిధిలోని గొల్లపాళెం ఆశ్రమంలోని 300 మంది చిన్నారులకు అల్లూరుకు చెందిన దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆదివారం దుస్తులు వితరణ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి దేవిరెడ్డి సుబ్బరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులకు దుస్తులను వితరణ చేస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతికి చిన్నారులకు కొత్త దుస్తులు అందించాలని ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అలాగే జూలైలో తన తల్లి బుజ్జమ్మ వర్ధంతి సందర్భంగా చిన్నారులకు విద్యా సామగ్రిని అందజేస్తామని తెలిపారు. ట్రస్ట్ సీఈఓ అనిల్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇన్‌చార్జి రామచంద్రరావు, ఆశ్రమ పాఠశాల కరస్పాండెంట్ రామచంద్ర శరత్‌బాబు, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాగుంటకు నివాళి



మాగుంట చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కావలి: పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డి 29వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సుబ్బరామరెడ్డి చిత్రపటానికి రెడ్‌క్రాస్ ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటికొండ నవీన్ 52వసారి రక్తదానం చేశారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడుతూ మాగుంట కావలి ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజాసేవకుడిగా ఆదరాభిమానాలు పొంది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. అనంతరం రక్తదాత నవీన్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హరినారపరెడ్డి, టీమ్ సేవియర్స్ ప్రణీత్, రెడ్‌క్రాస్ మేనేజర్ ప్రసాద్, టీమ్‌సేవియర్స్ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌పల్లి, బస్టాండ్ సెంటర్, సత్రంసెంటర్, బైపాస్‌రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ పనులను పర్యవేక్షించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వీధుల్లో చెత్త నిల్వ లేకుండా చూడాలని, డ్రైనేజీలు పొంగి మురుగు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు.



ఉత్సాహంగా..ఉల్లాసంగా

కావలిలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి అండర్–12 మినీ సబ్‌జూనియర్ రగ్బీ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 14 జిల్లాలకు చెందిన బాలబాలికల జట్లు ఉత్సాహంగా పోటీ పడ్డాయి – కావలి


కలిగిరి పీహెచ్‌సీ డాక్టర్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ గీతారెడ్డి

కలిగిరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. హెచ్ఐవీ వ్యాధిపై విస్తృతంగా అవగాహన కల్పించడం, హెచ్ఐవీ పరీక్షలు చేయించడం, వ్యాధిగ్రస్తులకు సకాలంలో ఏఆర్‌టీ మందులను పంపిణీ చేయడంపై ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని పురమందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ పెంచలయ్య, జిల్లా కుష్టు మరియు ఎయిడ్స్ నియంత్రణాధికారి ఎస్‌కే ఖాదర్‌వలి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా గీతారెడ్డికి వైద్యసిబ్బంది అభినందనలు తెలిపారు.

మెట్ట రైతులకు నిరాశ మిగిల్చిన ఫెంగల్



వరికుంటపాడు మండలంలో బెట్టకు వచ్చిన మినుము పంట

ఉదయగిరి: ఫెంగల్ తుపాను ఉదయగిరి మెట్టప్రాంత రైతులకు నిరాశే మిగిల్చింది. తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు చేసినా మెట్టప్రాంతంలో చిరుజల్లులే పడ్డాయి. శని, ఆదివారాల్లో కనీసం ఆర పదును వర్షం కూడా పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని మెట్ట మండలాల్లో మినుము, పెసర, కంది, దోస, పొగాకు పంటలను సాగు చేసి ఉన్నారు. 20 రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో పైర్లు బెట్టకు వచ్చాయి. అంతేకాకుండా శనగ, నువ్వుతో పాట ఇతర మెట్టపైర్లు సాగు చేసేందుకు రైతులు సన్నహాలు చేసుకున్నారు. తుపాను ప్రభావంతో వర్షాలు పడుతాయని రైతులు ఎంతో ఆశగా ఎదురు చూశారు. కానీ వర్షం లేకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. కనీసం పదును వాన అయినా పడితే మెట్ట పైర్లు వేసుకునే అవకాశం ఉంటుందని రైతులు వాపోతున్నారు.

అవగాహనతో ఎయిడ్స్‌కు అడ్డుకట్ట



రెడ్‌రిబ్బన్ నమూనాలో విద్యార్థులు, అధ్యాపకులు

కావలి: విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా ఎయిడ్స్ వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని జవహర్ భారతి కళాశాల ప్రిన్సిపల్ పీ సుబ్రహ్మణ్యం నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జవహర్ భారతి కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన పోస్టర్ల తయారీ పోటీలను ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన బృందాలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని తెలిపారు. ఎయిడ్స్‌కు చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి మాట్లాడుతూ ఎయిడ్స్ కేంద్రాలను సందర్శించి బాధితులను మానవత్వంతో ఆదరించాలని కోరారు. రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వీ వసుంధరాదేవి మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులపై దయ, కరుణ కలిగి ఉండాలని, వారిని ద్వేషించరాదన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు రెడ్‌రిబ్బన్ క్లబ్ నమూనాను ప్రదర్శించారు. విశ్వోదయ రెక్టార్ డీ వినయ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీ సుధాకర్‌రెడ్డి, రెడ్‌రిబ్బన్ క్లబ్ మెంబర్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

వింజమూరు(ఉదయగిరి): ఎయిడ్స్‌పై అవగాహన ఎంతో అవసరమని విశ్రాంత డీఎంహెచ్ఓ మాసిలామణి పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్‌డేను పురస్కరించుకుని వింజమూరులోని మాసిలామణి చిన్నపిల్లల వైద్యశాలలో పలువురు రోగులకు ఆయన వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని తెలిపారు. ప్రస్తుతం ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవడంతో కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు.గతంలో ఎయిడ్స్ బాధితులను సామాజికంగా బహిష్కరించేవారని, నేడు అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. వైద్యులు ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు మందులు అందజేస్తున్న డాక్టర్ మసిలామణి

అద్దె భవనంలో బీసీ విద్యార్థుల అవస్థ



వసతిగృహంలోకి వచ్చిన పాము



వసతిగృహంలో చేరుతున్న మురుగు

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేట శివార్లలోని ఓ అద్దె భవనంలో బీసీ కళాశాల విద్యార్థుల వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. వసతిగృహంలో దాదాపు 45 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. అద్దె భవనం రేకులది కావడంతో వర్షం పడితే ఉరుస్తూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనానికి ఓ వైపున ప్రహరీ లేదు. దీంతో వర్షం పడితే సమీపంలోని డ్రైనేజీ నుంచి మురుగు వసతిగృహంలో చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఆదివారం మురుగు నీటితో పాటు పాము వసతిగృహ వరండాలోకి చేరుకుని కలకలం రేపింది. విద్యార్థులు గమనించి పామును చంపివేశారు. అధికారులు స్పందించి వసతిగృహాన్ని సురక్షిత భవనంలోకి తరలించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఎస్‌డబ్ల్యూఓ సీహెచ్ శ్రీదేవిని సంప్రదించగా వసతిగృహ అద్దె భవనం రేకులు పగిలిపోయి ఉరుస్తున్న విషయం వాస్తవమేనని, మరో భవనంలోకి మార్చేందుకు పరిశీలిస్తున్నామన్నారు.

గ్రావెల్ తోలారు.. వదిలేశారు



జలదంకి: మండలంలోని చినక్రాక పాత పోలీస్‌స్టేషన్ సెంటర్ వద్ద కావలి–ఉదయగిరి జాతీయ రహదారి పక్కనున్న బస్సు షెల్టర్ చుట్టూ గ్రావెల్‌ను తోలి చదును చేయకుండా వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్ల క్రితం ఈ షెల్టర్‌ను నిర్మించారు. చినక్రాక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న షెల్టర్ చుటూ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా గ్రావెల్‌ను తోలారు. దాన్ని చదును చేయకుండా అలాగే వదిలేయడంతో వర్షం కురిస్తే షెల్టర్‌లో నీరు చేరుతూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హైవే అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గ్రావెల్‌ను చదును చేయించి సమస్యను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.